"ఆమె వంటింట్లో వున్నారు...పిలుస్తాను"...అంటూ మా బావ గారికి కాళ్ళకు నీళ్లకూడా తేవడానికి పెరటివేపు వెళ్లాను.

అప్పుడే అరిటాకుకోసం కత్తిపట్టుకొని బయల్దేరారు మా అత్తగారు. 'బావగా రొచ్చా' రన్నాను.

"ఎప్పుడూ? యింత పొద్దెక్కి ఏంబండి వుందీ?"

"ప్రొద్దుటే వచ్చారులావుంది. బహుశా, సాకమ్మావా ళ్లింటికి వెళ్లి వచ్చివుంటారు. అందుకే ఆలస్యమైం దనుకుంటాను" అన్నాను.

"అయితే భోంచేయలే దన్నమాట!...అయ్యో నెత్తిరాతా...ఈ పూట ఆ అరిటిగెలే వుంటే అక్షణంగా పొడిచేసేదాన్ని...వాడిక్కూడా అరిటి కాయపొడి అంటే ఎంతో యిష్టం అని మా తోడికోడలు చెప్తుండేది... ఈ పూట వట్టి పత్యంమెతుకులు పెట్టాల్సిందే వాడికి...అరిటిగెల గొడవలో ఈ పూట అప్పులు కూరగాయలు తీసుకురాలా మార్కెట్‌నుంచి. ఒట్టి సాంబారు చేసి అప్పడాలు వేయించాడు...నేనూ ఒట్టి పచ్చడిమెతుకులు చేసుకున్నాను....యిప్పటికే పన్నెండు దాటింది. ఇప్పు డిక కూరగాయలు మార్కెట్‌నుంచి తెప్పించీ, వంటచేసీ, ఎప్పుడు వాడికి అన్నం బెట్టడం! అన్నట్లు నీ మొగుడు గృహప్రవేశానికి వెళ్లా డన్నావు గదూ!....ప్రొద్దున కారు తీసికెళ్లినవా డింకా రాలేదేం? అక్కడే భోంచేసి వస్తాడా ఏకంగా?" ...అన్నారు మా అత్తగారు.

"అప్పే లేదు...ఇప్పుడే ఆయన వచ్చారు...వెనకాలే బావగారూ వచ్చారు" అన్నారు.

"అయ్యో నెత్తిరాతా!...ఈ పూటే ఇంట్లో కూరగాయలు లేకుండా పోవాలా! సరే, నీవు వెళ్ళి సింహుడికి కాళ్ళకు నీళ్ళిచ్చిరా. నే నేదో తంటాలుపడతాను"...అంటూ పెరటివేపు వెళ్ళారు మా అత్తగారు. బ్రతికాం అనుకుని మా బావగారి కాళ్ళకు నీళ్ళు తీసుకెళ్లాను.

